సాక్షి నిజామాబాద్

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



ప్రత్యేక పాలనకు..

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పాలన ముగిసి, ప్రత్యేక పాలన ప్రారంభమై ఏడాది పూర్తయ్యింది.

- IIలో ▸



జిల్లా కోర్టుకు స్థలం..

పాత డీఈవో కార్యాలయ స్థలాన్ని జిల్లా కోర్టుకు కేటాయించాలని హై కోర్టు న్యాయమూర్తిని న్యాయవాదులు కోరారు.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.8 /15.3

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

ఆపరేషన్ స్మైల్‌లో 60 మంది పిల్లల గుర్తింపు

- ఇద్దరు యజమానులపై కేసులు నమోదు

ఖలీల్‌వాడి: ఆపరేషన్ స్మైల్‌లో 60 మంది పిల్లలను గుర్తించినట్లు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో జనవరి 1 నుంచి 31 వరకు ఆపరేషన్ స్మైల్ -11 నిర్వహించారు. ఇందులో 18 సంవత్సరాలలోపు తప్పిపోయిన, వదిలి వేయబడిన, కార్మికులుగా ఉన్న బాలబాలికలను గుర్తించారు. తాము గుర్తించిన 60 మంది పిల్లలకు సంబంధించి నిజామాబాద్ నగరం రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలో యజమాని ఒకరిపై, ఆర్మూర్ డివిజన్‌లోని నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఇన్‌చార్జి సీపీ తెలిపారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. నిజామాబాద్ సబ్ డివిజన్‌లో 21 మంది పిల్లలను, ఆర్మూర్ సబ్ డివిజన్‌లో 16 మందిని, బోధన్ సబ్ డివిజన్‌లో 23 మందిని గుర్తించినట్లు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి నామినేషన్



సుభాష్‌నగర్: బీజేపీ జిల్లా అధ్యక్ష పదవికి దినేష్ పటేల్ కులాచారి శనివారం నామినేషన్ దాఖలు చేశారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ప్రతి మూడేళ్లకోసారి జిల్లా అధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించడం బీజేపీలో ఆనవాయితీ. జిల్లా అధ్యక్ష పదవికి ఒకటే నామినేషన్ వచ్చినట్లు తెలిసింది. రెండు, మూడు రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల అధ్యక్షులతో పాటు నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడిని ప్రకటించే అవకాశముంది.

నామి నేషన్ దాఖలు కార్యక్రమంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, సీనియర్ నాయకులు లోక భూపతిరెడ్డి, టక్కర్ హన్మంత్‌రెడ్డి, జిల్లా పదాధికారులు, అసెంబ్లీ కన్వీనర్లు, మండల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



సాక్షి ఎఫెక్ట్..

ఆర్మూర్‌టౌన్: 'అంగన్‌వాడీల్లో నాసిరకం గుడ్లు' శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఆర్మూర్ సెక్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీవో భార్గవి, సూపర్‌వైజర్ నళిని సందర్శించారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందించాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. నాసిరకం గుడ్లు సరఫరా అయితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా..



అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా రూపొందించిన బడ్జెట్. ఇప్పటికే జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటైంది. వాణిజ్య శాఖ ద్వారా నిధులు మంజూరు అవుతాయి. వ్యవసాయంలో ముందంజలో ఉన్న జిల్లాకు మరింత మేలు కలిగించే బడ్జెట్. కూరగాయల సాగుతో పాటు ఎగుమతులకు ప్రోత్సాహంలో భాగంగా కార్గో సౌకర్యం కల్పించారు. ఎంఎస్ఎంఈ, స్టార్టప్‌ల రుణాల పెంపు ద్వారా ఎంటర్‌ప్రెన్యూయర్లకు తిరుగులేని ప్రోత్సాహం కలుగనుంది. అన్నివర్గాలకు మేలు చేసే ఈ బడ్జెట్ ద్వారా వికసిత్ భారత్ కల తప్పకుండా సాకారమవుతుంది.

– ధర్మపురి అర్వింద్, ఎంపీ

సంకీర్ణ ప్రభుత్వ బడ్జెట్



గత కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లకు 2025–26 బడ్జెట్ పూర్తి భిన్నంగా ఉంది. సంకీర్ణ ప్రభుత్వంలో భాగస్వామ్య పక్షాలకు పెద్దపీట వేశారు. వికసిత్ భారత్ లక్ష్యంగా వ్యవసాయాభివృద్ధికి చతుర్ముఖ వ్యూహాన్ని పాటిస్తూ, చిన్న మధ్యతరహా పరిశ్రమలలో పెట్టుబడి పరిమితిని పెంచటం, ఎగుమతులకు ప్రత్యేక ప్రాధాన్యాన్ని ఇవ్వడం వృద్ధి రీత్యా అనుకూలమైనవి. ప్రధాన మంత్రి ధన్, ధాన్య కృషియోజన పథకాన్ని అన్ని జిల్లాలలో ప్రవేశపెడితే బాగుండేది. ప్రతి జిల్లా ఆస్పత్రిలో క్యాన్సర్ కేర్ సెంటర్, ఏఐ విద్యకు ప్రాముఖ్యత, పరిశోధన, అభివృద్ధి రంగాలకు నిధుల కేటాయింపు బాగుంది. రెవెన్యూ ఆదాయం 34.2 శాతం పెరగకపోవచ్చు. రెవెన్యూ లోటు పెరిగే ప్రమాదం ఉంది.

– కే రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్, తెయూ

వ్యవసాయ జిల్లాకు మేలు

గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలకు కేటాయింపులు

వేతన జీవికి ఊరట

ఆదాయపన్ను శ్లాబ్ రేటులో మినహాయింపు



- పసుపు బోర్డుకు నిధులు వస్తాయని ఆశాభావం
- కూరగాయల ఎగుమతికి కార్గో.. పప్పుధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం
- గల్ఫ్ పాలసీ ప్రస్తావన లేకపోవడంతో వలస కార్మికుల్లో నిరాశ
- ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ రైల్వేలైన్ విషయంలోనూ అసంతృప్తి
- నిర్మలమ్మ పద్దుపై మిశ్రమ స్పందన

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆదాయ పన్ను శ్లాబ్ రేటులో భారీ మినహాయింపులు ఇచ్చారు. దీంతో జిల్లాలో సుమారు లక్ష మందికి పైగా ఉన్న టాక్స్ పేయర్లలో (ట్రేడర్లు, డీలర్లు, ఉద్యోగులు, కాంట్రాక్టర్లు) హర్షం వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.2,66,817 కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ.1,71,437 కోట్లు, వాణిజ్య, పరిశ్రమల రంగానికి రూ.65,553 కోట్ల కేటాయింపులు చేశారు. గ్రామీణ ప్రాంతం ఎక్కువగా, వ్యవసాయ రంగంలో ప్రత్యేకత చాటుకుంటున్న నిజామాబాద్ జిల్లాకు ఉపయోగం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఇప్పటికే జిల్లాలో ఏర్పాటు చేసిన పసుపు బోర్డుకు నిధులు వస్తాయని, వ్యవసాయంలో నూతన కల్పనలకు రైతులకు దన్ను లభిస్తుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. కూరగాయల ఎగుమతులకు కార్గో సౌకర్యం, పప్పుధాన్యాల ఉత్పత్తికి స్వయం సమృద్ధి పథకం ఏర్పాటుతో మేలు కలుగుతుందని పలువురు అంటున్నారు. పీఎం ధన్‌ధాన్య కృషి యోజన, కిసాన్ క్రెడిట్ కార్డ్ పరిమితి పెంపు విషయమై హర్షం వ్యక్తమవుతోంది. మరోవైపు స్ట్రీట్ వెండర్స్‌కు రూ.30 వేల క్రెడిట్ కార్డ్, అన్ని పాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు, అంగన్‌వాడీలకు కొత్త హంగుల విషయమై స్పందన బాగుంది. ఇక ఎంఎస్ఎంఈలకు మరింత ప్రాధాన్యత, స్టార్టప్‌లకు రూ.10కోట్ల నుంచి రూ.20కోట్లకు రుణాలు పెంచే విషయంలో సానుకూల స్పందన వస్తోంది.

■ ఏళ్లతరబడి ఎదురుచూస్తున్న ఆర్మూర్–నిర్మల్–ఆదిలాబాద్ కొత్త రైల్వేలైన్ ప్రస్తావన లేకపోవడంతో నిరాశ వ్యక్తమవుతోంది. ఇక ఉత్తర తెలంగాణలో అత్యధికంగా ఉన్న గల్ఫ్ వలస కార్మికుల కుటుంబాలు ప్రత్యేక గల్ఫ్ పాలసీ కోసం డిమాండ్ చేస్తున్నాయి. దీనిపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఆ వర్గాలు నిరాశ చెందుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్లు ఉన్నాయి. దీనిపైనా వ్యాపార వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఉత్తరాది బడ్జెట్‌లాగా ఉంది



నిర్మలా సీతారామన్ బడ్జెట్ కేంద్ర బడ్జెట్ లాగా కాకుండా పూర్తిగా ఉత్తరాది బడ్జెట్ మాదిరిగా ఉంది. బీహార్, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలకు భారీగా కేటాయింపులు చేసి ఆదాయం ఇచ్చే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేశారు. నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వే లైన్ విషయమై నయా పైసా కేటాయించలేదు. గల్ఫ్ కార్మికుల కోసం పాలసీ ఏర్పాటు చేయలేదు. ఇక ఆర్భాటం చేసిన పసుపు బోర్డుకు నిధులు ఇవ్వలేదు. ఇది పూర్తిగా కార్పొరేట్ శక్తులకు మేలు చేసే బడ్జెట్. – మానాల మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు

తెలంగాణకు మొండి చేయి



బడ్జెట్‌లో కేంద్రం మొండి చేయి చూపించింది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీలు ఎనిమిది మంది, బీజేపీ ఎంపీలు ఎనిమిది మంది ఉన్నా నిధులు తేకపోవడం బాధకరం. పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తదనం ఏమీలేదు. బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంది.

– దాదన్నగారి విఠల్‌రావు, జెడ్పీ మాజీ చైర్మన్

పాత సీసాలో కొత్త సారా



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్తదనం ఏమీలేదు. పాత సీసాలో కొత్త సారాగా ఉంది. పేద, సాధారణ ప్రజలకు కేటాయింపులు ఇవ్వలేదు. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు కేవలం మభ్యపెట్టే చర్య మాత్రమే.

కార్మిక వర్గానికి, పట్టణ పేదలకు ఉపాధి అవకాశాల్ని పెంచటానికి నిధులను కేటాయించలేదు. బడ్జెట్ అసంతృప్తికరంగా ఉంది. పేదలకు నిరాశే మిగిల్చింది.

– ఏ రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పన్ను సవరణ సంతోషకరం



పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రభుత్వ ఉద్యోగులకు, వేతన జీవులకు, చిరు ఉద్యోగులకు ఊరటనిచ్చింది. ఆదాయపన్ను మినహాయింపు కోసం ఉద్యోగులు గత కొన్నేళ్లుగా ఎదురుచూస్తున్నారు. వార్షిక ఆదాయం రూ.4 లక్షల వరకు పన్ను మినహాయింపు, రూ.12 లక్షల లోపు పన్ను సవరించడం సంతోషకరం.

– చిదుర రమేశ్ గుప్తా, జాయింట్ సెక్రెటరీ, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్

ముడిసరుకులు దేశీయంగా సమకూర్చుకోవాలి



వన్ నేషన్ వన్ పెట్రోల్ పాలసీని ఏర్పాటు చేయాలి. ఈ విషయమై దృష్టి సారించలేదు. స్థానికంగా ఉపాధి పెంచేందుకు ఆటోమొబైల్ రంగంలో 90 శాతం ముడి వస్తువులను దేశీయంగా సమకూర్చుకోవాలి. దీంతో కార్ల ధరలు 30 శాతం తగ్గుతాయి. ఆటోమొబైల్ ఉత్పత్తుల ఎగుమతులకు పన్ను రాయితీలు ఇస్తున్న విధంగా భారత్‌లో అమ్మినప్పటికీ రాయితీలు ఇచ్చే స్థాయికి ముడి వస్తువుల ఉత్పత్తి సాధించాలి. ఈ దిశగా ఆటోమొబైల్ రంగంలో మార్పులు తీసుకురావాలి.

– నల్ల దినేష్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు

ఎన్‌డీసీసీబీకి పూర్వవైభవం తీసుకురావాలి



కేక్ కట్ చేస్తున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి, బ్యాంకు ఉద్యోగులు

- బ్యాంకు జిల్లా చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

సుభాష్‌నగర్: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (ఎన్‌డీసీసీబీ)కి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పాలక వర్గంతోపాటు ప్రతి ఉద్యోగి కృషి చేయాలని, బ్యాంకును రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని ఉమ్మడి జిల్లా చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో బ్యాంకు మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024–25 ఆర్థిక సంవత్సరం డిసెంబర్, జనవరి నెలల్లో బ్యాంకు వ్యాపార కార్యకలాపాలు రూ.200 కోట్లకు చేరిన సందర్భంగా కుంట రమేష్‌రెడ్డి కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి ఉద్యోగికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కుంట రమేష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా బ్యాంకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 14 శాతమున్న ఎన్‌పీఏ 10 శాతానికి తగ్గించారని, ఆర్థిక సంవత్సరం ముగింపు వరకు ఎన్‌పీఏ మరింత గణనీయంగా తగ్గించాలన్నారు. తద్వారా బ్యాంకు యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు అర్హత సాధిస్తామన్నారు. ఆయా శాఖల మేనేజర్లతో వ్యక్తిగతంగా సమీక్షించి, శాఖల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీఈవో నాగభూషణం వందే, ఉన్నతాధికారులు, ఉమ్మడి జిల్లాలోని 63 శాఖల మేనేజర్లు పాల్గొన్నారు.

మండలి ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- పక్కాగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు
- వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించిన రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

నిజామాబాద్‌అర్బన్: శాసన మండలి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. శాసన మండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సీ సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాలతో కూడిన పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఏర్పాట్లపై కలెక్టర్ హనుమంతు సీఈవో దృష్టికి తెచ్చారు. జిల్లాలో పట్టభద్రులకు సంబంధించి 33 మండలాల్లోని 48 పోలింగ్ కేంద్రాల పరిధిలో 30,593 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 33 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,529 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, వాల్ రైటింగ్, జెండాలు, ప్రకటనలను తొలగించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, సామాజిక మాధ్యమాలలో వచ్చే ప్రసారాలను నిశితంగా పరిశీలన జరిపేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులను నిబంధనలకు అనుగుణంగా జారీ చేస్తామన్నారు. నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులకు ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై కీలక సూచనలు చేశారు. తుది ఓటర్ల జాబితాను తప్పిదాలకు తావులేకుండా రూపొందించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న టీచర్లు, పట్టభద్రుల ఓటరు దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 7లోపు పరిష్కరించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగే పోలింగ్ ప్రశాంత వాతావరణంలో, పూర్తి పారదర్శకంగా జరిగేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, అధికారులు పాల్గొన్నారు.

మేత కోసం మైళ్ల దూరం..

- ఆర్మూర్ మండలం చేపూర్ పల్లె నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్ వరకు..
- గొర్రెల మేత కోసం కాలి నడకన రాష్ట్రాలు దాటి వెళ్తున్న కాపరులు
- స్థానికంగా పంటల కారణంగా కనపడని మేత భూములు
- కాపరికి, గొర్లకు ఇన్సూరెన్స్ సైతం లేని దుస్థితి



కాలి నడకన మహారాష్ట్రకు పయనమవుతున్న గొర్లు, గొర్ల కాపరులు (ఫైల్)



మహారాష్ట్రలోని ధర్మాబాద్ ప్రాంతంలో గల కర్కెల్లి గ్రామంలోని పత్తి చేన్లలో మేపుతున్న ఆర్మూర్ మండలం చేపూర్ పల్లెకు చెందిన గొర్రెల కాపరులు

ఆర్మూర్: 'ప్రభుత్వం ఏదైనా వృత్తి దారులను చిన్న చూపు చూస్తోంది. మా కుల వృత్తిని కొనసాగిస్తూ గొర్ల మందను మేపుతూ జీవనోపాధి కల్పించుకుంటున్నాము. కాని గొర్రెల కడుపు నింపడానికి అష్టకష్టాలు పడాల్సివస్తోంది. స్థానికంగా గ్రామంలో విస్తారంగా పంటలు పండిస్తుండటంతో మేత భూములు కరువయ్యాయి.. ఇక చేసేది లేక నా మందలోని 150 గొర్లను మేపడం కోసం ప్రతి ఏటా మా గ్రామం నుంచి మహారాష్ట్రలోని ధర్మాబాద్ జిల్లాలోని కర్కెల్లి గ్రామానికి కాలి నడకన వెళ్లి జనవరి, ఫిబ్రవరి రెండు నెలల పాటు పత్తి చేళ్లలో గొర్లను మేపుతున్నాం'. అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు ఆర్మూర్ మండలం చేపూర్ పల్లె గ్రామానికి చెందిన గొర్లకాపరి ఆది శ్రీనివాస్. తమ గ్రామంలో మూడు మందలు ఉండగా మహారాష్ట్రలోని చెరో ప్రాంతానికి గొర్లను మేతకు తీసుకెళ్లారని చెప్పాడు. చేపూర్ పల్లె నుంచి సుమారు 50 నుంచి 60 మైళ్ల దూరం కాలి నడకన మహారాష్ట్రలోని ధర్మాబాద్ ప్రాంతానికి గొర్ల మందలను తీసుకెళ్తున్నాడు. కాపరులు ఈ రెండు నెలల పాటు కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటంతో పాటు అనారోగ్య పరిస్థితుల్లో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గొర్లకు, కాపరికి ఇన్సూరెన్స్ సౌకర్యం లేదు.. రోడ్డు ప్రమాదాలు, రోగాలు, దొంగల బారిన పడితే నష్టపోవాల్సింది గొర్ల కాపరే. గొర్లకు ఇన్సూరెన్స్ చేయించాలి అంటే అది కాపరిపై ఆర్థిక భారం మోపడమే అవుతోంది.

జిల్లాలోని ఆర్మూర్, నందిపేట, మాక్లూర్, నవీపేట్, బోధన్, రెంజల్ తదితర మండలాల్లోని గ్రామాల్లో మేత భూములు అందుబాటులో లేకపోవడంతో గొర్రెల కడుపు నింపడానికి కాపరులు కాలి నడకన వందల కిలో మీటర్ల దూరం వలస వెళ్తున్నారు. జిల్లాలో అధికారుల గణాంకాల ప్రకారం సుమారు నాలుగు లక్షల గొర్రెలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 60 శాతం గొర్లను పత్తి చేళ్లలో మేతకు మహారాష్ట్రకు తీసుకెళ్తున్నారు. అక్కడి గ్రామస్తుల సహకారంతో పంట చేళ్లలోనే రెండు నెలల పాటు వంట చేసుకొని ఉంటూ ఫిబ్రవరి నెలాఖరులో గొర్ల మందను వెంటేసుకొని తిరిగి స్వగ్రామానికి కాలి నడకన చేరుతున్నారు.

మేత భూముల కేటాయింపు లేదు

గ్రామాల్లో పశువులు, గీత కార్మికులకు కేటాయించినట్లుగా గొర్ల కాపరులకు మేత భూములు కేటాయించిన దాఖలాలు లేకపోవడంతో రైతులు పంటలు వేసిన సమయంలో గొర్లను మేపడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు గ్రామాల్లో మేత భూములు కేటాయించాలని కోరుతున్నారు.

గొర్ల కాపరులకు పింఛన్లు ఇవ్వాలి



గొర్లను మేపడం కోసం అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని దూర ప్రాంతాలకు వెళ్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం వృత్తిదారులకు ఇస్తున్నట్లుగా గొర్ల కాపరులకు సైతం పింఛన్ ఇస్తే కుటుంబాలకు ఆసరా అవుతుంది. అదేవిధంగా గొర్లు రోగాల బారిన పడినపుడు ప్రైవేటులో మందులు కొనడం ఆర్థిక భారం అవుతోంది. ప్రభుత్వమే ఉచితంగా మందులు పంపిణీ చేయాలి.

– ఆది శ్రీనివాస్, గొర్ల కాపరి, చేపూర్ పల్లె, ఆర్మూర్ మండలం

మేత భూములు కేటాయిస్తే ప్రోత్సహిస్తాం



పంటల కారణంగా మేతకు వలస వెళ్లడం తెలిసిందే. కాని ఈ సమస్యకు పరిష్కారం మాత్రం మేత భూములు కేటాయించడమే. గ్రామాల్లో మేత భూములు కేటాయించడం లేదా లీజుకు తీసుకోవడం లాంటివి చేస్తే పశు సంవర్ధక శాఖ నుంచి ప్రోత్సాహకాలు అందిస్తాము.

– డాక్టర్ వీ జగన్నాథ చారి, జేడీ, పశు సంవర్ధక శాఖ, నిజామాబాద్

క్లుప్తంగా

కదిలిన యంత్రాంగం



నిజామాబాద్‌ నాగారం: జిల్లా కేంద్రంలోని అసద్‌బాబానగర్‌ ప్రాంతంలో అటవీశాఖ భూమితోపాటు ప్రైవేట్‌ వ్యక్తి భూమి కబ్జా చేసిన వైనంపై 'రూ.కోట్ల విలువైన భూమి కబ్జా' శీర్షికన 'సాక్షి'లో శనివారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. 2144, 2166 సర్వే నంబర్లలోని భూములను రెవెన్యూ, అటవీ, సర్వే ల్యాండ్‌ అధికారులు పరిశీలించారు. ప్రహరీని తొలగించాలని ఆదేశించారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు. భూమిని పరిశీలించిన వారి లో సౌత్‌ తహసీల్దార్‌ బాలరాజు, అటవీ, సర్వే అధికారులు ఉన్నారు.

జిల్లా కోర్టుకు స్థలం ఇవ్వాలి



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పాత డీఈవో కార్యాలయ స్థలాన్ని జిల్లా కోర్టుకు కేటాయించాలని నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ సభ్యులు హైకోర్టు న్యాయమూర్తులకు వినతిపత్రం అందజేశారు. శనివారం కామారెడ్డి జిల్లా బాన్సువాడలో హైకోర్టు న్యాయమూర్తులు అలిశెట్టి లక్ష్మీనారాయణ, జె శ్రీనివాసరావును బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్‌గౌడ్‌ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఖాళీగా ఉన్న జడ్జీల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. తమ వినతులపై న్యాయమూర్తులు సానుకూలంగా స్పందించారని జగన్‌గౌడ్‌ తెలిపారు. బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, కోశాధికారి ఏ దీపక్‌, న్యాయవాది ఆరేటి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ప్రత్యేక' పాలనకు ఏడాది పూర్తి

- గ్రామపంచాయతీలకు తీవ్ర నిధుల కొరత
- స్తంభించిన గ్రామ పాలన
- ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు
- పల్లె పోరు మరింత ఆలస్యం!



ధర్మారం(ఎం) గ్రామపంచాయతీ కార్యాలయం

సుభాష్‌నగర్‌: గ్రామపంచాయతీల్లో పాలకవర్గాల గడువు ముగిసి, ప్రత్యేకాధికారుల పాలన మొదలై నేటితో ఏడాది పూర్తయ్యింది. పంచాయతీలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడంలేదు. దీంతో జీపీలు నిధుల కొరతను ఎదుర్కొంటున్నా యి. గ్రామాల్లో పాలన అస్తవ్యస్తంగా తయారైంది. ఏడాది కాలంగా పంచాయతీలకు నిధులు లేక నిర్వహణ స్తంభించిపోయింది. మల్టీపర్పస్‌ కార్మికులకు మాత్రం వేతనాలు వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. మరోవైపు పంచాయతీ ఎన్నికల కోసం ఆశావహులు ఎదురుచూస్తున్నారు. కానీ బీసీ గణన, ఇతరాత్ర కారణాలతో పల్లె పోరు మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నట్లు ప్రభుత్వవర్గాల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో 545 (కొత్త వాటిని కలుపుకుని) జీపీలు, 5022 వార్డు స్థానాలున్నా యి. గతేడాది ఫిబ్రవరి 1తో పంచాయతీల పాలకవర్గాలకు గడువు ముగిసింది. 2వ తేదీన ప్రత్యేకాధికారులు బాధ్యతలు స్వీకరించారు. మండలానికో జిల్లా స్థాయి అధికారిని, గ్రామాలకు సీనియర్‌ అసిస్టెంట్‌ పైస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా ప్రభుత్వం నియమించింది. అప్పటి నుంచి గ్రామాలు ప్రత్యేక పాలనలో కొనసాగుతున్నాయి.

నిర్వహణ అస్తవ్యస్తం

గ్రామపంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇంటి పన్ను వసూళ్లతో కార్మికుల వేతనాలు చెల్లించగా, జనవరి నుంచి రాష్ట్ర ప్రభుత్వమే వారి ఖాతాల్లో వేతనాలను జమ చేస్తోంది. మిగతా పంచాయతీల నిర్వహణను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయి. వీధిలైట్లు, తాగునీటి క్లోరినేషన్‌, ఇతరాత్ర నిర్వహణ అంతా పన్నుల రూపేణా వచ్చిన నిధులతో చేపడుతుండగా, మరికొన్ని చోట్ల కార్యదర్శులు తమ సొంత డబ్బుతో చేపడుతున్నారు. ఇక అభివృద్ధి పనుల ఊసేలేదు.

మండల, జిల్లా పరిషత్‌ ఎన్నికలే ముందు?

గ్రామపంచాయతీ ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ఏర్పాట్లను అధికార యంత్రాంగం పూర్తి చేసినప్పటికీ.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. దీనికితోడు బీసీ రిజర్వేషన్లపై కూడా స్పష్టత లేదు. ఫిబ్రవరి రెండోవారంలో బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. మార్చి, ఏప్రిల్‌లో పదోతరగతి,ఇంటర్‌ విద్యార్థులకు వార్షిక పరీక్షలు ఉంటాయి. అందుకోసం పంచాయతీ ఎన్నికలు మే నెలలోనే నిర్వహించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల కంటే ముందు జిల్లా పరిషత్‌, మండల పరిషత్‌ ఎన్నికలు ఉంటాయని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది.

జీపీలకు నిధుల కొరత

ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామపంచాయతీలు తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. 2024–25 సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.56.80 కోట్లు రావాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.11.80 కోట్లు పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌ఎఫ్‌సీ నుంచి రూ.66.82 కోట్లకుగాను 10 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామపంచాయతీలకు రూ.110 కోట్లకుపైనే నిధులు రావాల్సి ఉంది. నిధుల జాడ లేకపోవడంతో పంచాయతీల నిర్వహణ ప్రత్యేకాధికారులకు తలకు మించిన భారంగా మారింది. పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలి


మాట్లాడుతున్న షాహిద్‌ మసూద్‌

ఆర్మూర్‌టౌన్‌: వార్డు అధికారులు, మున్సిపల్‌ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని మున్సిపల్‌ అడ్మినిస్ట్రేటీవ్‌ వరంగల్‌ ప్రాంతీయ సంచాలకులు షాహిద్‌మసూద్‌ అన్నారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి సమీక్షాసమావేశం నిర్వహించారు. వార్డు, మున్సిపల్‌ అధికారులు, సిబ్బందికి విధులపై దిశానిర్దేశం చేశారు. మున్సిపల్‌ కమిషనర్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీపెడ్‌ పరీక్ష ఫీజు చెల్లించాలి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బీపెడ్‌ (బ్యాచ్‌లర్‌ ఆఫ్‌ ఫిజికల్‌ ఎడ్యుకేషన్‌ 2024–25) ఒకటో, మూడో సెమిస్టర్‌ రెగ్యులర్‌ విద్యార్థులు ఈ నెల 6వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని కంట్రోలర్‌ ఎం అరుణ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. రూ.100 అపరాధ రుసుముతో 7వరకు పరీక్ష ఫీజు చెల్లించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్‌

యాప్‌తో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్ట్‌


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రాజావెంకటరెడ్డి

ఖలీల్‌వాడి: ఎంజీఐ యాప్‌లో పెట్టుబడులు పెట్టించి మోసం చేసిన ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో శనివారం కేసుకు సంబంధించిన వివరాలను ఏసీపీ వెల్లడించారు. తమతో ఎంజీఐ యాప్‌లో పెట్టుబడి పెట్టించి మోసం చేశారని నగరంలోని ఐదో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో 12 మంది ఫిర్యాదు చేయగా, నార్త్‌ సీఐ శ్రీనివాస్‌ విచారణ చేపట్టారన్నారు. నగరంలోని ముజాహిద్‌ నగర్‌కు చెందిన ఫొటోగ్రాఫర్‌ షేక్‌ అమీర్‌ అలియాస్‌ ఖలీల్‌, బర్కత్‌పురాకు చెందిన డెలివరీ బాయ్‌ సయ్యద్‌ ఇమాన్‌ అలీని అదుపులోకి విచారించామన్నారు. ఆన్‌లైన్‌లో డబ్బులు సంపాదించడం ఎలా అని టెలిగ్రామ్‌ యాప్‌లో వెతికి ఎంజీఐ యాప్‌లో పెట్టుబడులు పెట్టాలని షేక్‌ అమీర్‌ తెలుసుకున్నాడని, అతడి ద్వారా డెలివరీ బాయ్‌ సయ్యద్‌ ఇమాన్‌ అలీ యాప్‌లో జాయిన్‌ అయినట్లు తెలిపారు. ఇద్దరూ కలిసి నగరంలోని ముజాహిద్‌నగర్‌ హష్మీ కాలనీకి చెందిన పలువురిని చేర్పడంతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యాప్‌ స్కానర్‌ ద్వారా పలువురితో పెట్టుబడులు పెట్టించి వాటిని మళ్లీ వెనక్కి తీసుకోకుండా ఫ్రీజ్‌ చేశారన్నారు. ఆఫర్స్‌కు సంబంధించిన డబ్బులు తీసుకునేందుకు యాప్‌ నిర్వాహకులకు మళ్లీ డబ్బులు చెల్లించాలని డిమాండ్‌ చేసేవారని పేర్కొన్నారు. ఎంజీఐ యాప్‌ ఐపీ అడ్రస్‌ అమెరికాలోని కాలిఫోర్నియాలోని లాస్‌ఏంజిల్స్‌ నుంచి ఆపరేట్‌ చేస్తున్నట్లు, భారతదేశంలో శాలి వర్మ నడిపిస్తున్న నమ్మించి ప్రజలను మోసం చేశారన్నారు. యాప్‌లో ఒక్కొక్కరి ద్వారా గత ఐదు నెలలుగా రూ.100 నుంచి రూ.50వేల వరకు పెట్టుబడులు పెట్టించారని, 12 మంది రూ.2.50లక్షలు పెట్టారని వివరించారు. ఇద్దరిని అరెస్టు చేసి మొత్తంలో మోసం జరగకుండా మొదట్లోనే అడ్డుకున్నామని ఏసీపీ అన్నారు. యాప్‌లు, మల్టీ మార్కెటింగ్‌ పేరుతో వచ్చే వారిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. నిజామాబాద్‌ నార్త్‌ సీఐ శ్రీనివాస్‌, ఎస్సై లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ బోల్తాపడి ఒకరి మృతి


ధర్పల్లి శివారులో బోల్తా పడిన ట్రాక్టర్‌

ధర్పల్లి: ట్రాక్టర్‌ బోల్తా పడి ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రం శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. దుబ్బాక గ్రామానికి చెందిన బొల్లారం సాయిలు (52) యూరియా కోసం ట్రాక్టర్‌పై వెళ్తుండగా ధర్పల్లి శివారులోని పసుపు పరిశోధన కేంద్రం సమీపంలో టాక్టర్‌ అదుపుతప్పి పంట చేనులో బోల్తా పడింది. ఇంజిన్‌ పైన పడడంతో సాయిలు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అతివేగమే ప్రమాదానికి కారణమని, మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పరిస్థితి విషమించి మహిళ ..

మాక్లూర్‌: ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని తీవ్రగాయాలపాలైన వృద్ధురాలు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఏఎస్సై నర్సయ్య తెలిపారు. గత నెల 27వ తేదీన మండలంలోని ముత్యంపల్లికి చెందిన రాజగల్లు నర్సుబాయి (69) కట్టెల పొయ్యిపై నీళ్లు వేడి చేస్తుండగా ప్రమాదవశాత్తు చీరకు నిప్పంటుకుని గాయాలయ్యాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం ఉదయం మృతి చెందిందన్నారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీడియో జర్నలిస్ట్‌..


మహిపాల్‌ (ఫైల్‌)

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని ఠాణాకలాన్‌ విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వీడియో జర్నలిస్ట్‌ మహిపాల్‌ మృతి చెందాడు. ఠాణాకలాన్‌ నుంచి నిజామాబాద్‌కు బైక్‌పై వస్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో మృతుడి రెండు కాళ్లు విరిగి తీవ్ర రక్తస్రావమైంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి అన్న వెంకట్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై ఇలియాస్‌ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాధిత కుటుంబానికి జర్నలిస్ట్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ రూ.10 వేలు, మహిపాల్‌ పనిచేసిన మీడియా సంస్థ యాజమాన్యం రూ.10 వేలు అందజేసింది.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి..

బోధన్‌రూరల్‌: మండలంలోని లంగ్డాపూర్‌ గ్రామ శివారులోని చెక్‌ డ్యాములో చేపలు పట్టేందుకు వెళ్లి గ్రామానికి చెందిన రాసుల సాయిలు (41) మృతిచెందినట్లు బోధన్‌ రూరల్‌ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి శనివారం తెలిపారు. సాయిలు ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందాడని, మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన కోల దేవీసింగ్‌ కుటుంబ కలహాల కారణంగా శుక్రవారం రాత్రి ఒంటిపై పెట్రోల్‌ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసినట్లు బోధన్‌ రూరల్‌ సీఐ విజయ్‌బాబు శనివారం తెలిపారు. కుటుంబ సభ్యులతో గొడవపడిన దేవీసింగ్‌ క్షణికావేశంలో ఇంట్లో ఉన్న పెట్రోల్‌ ఒంటిపై పోసుకొని నిప్పంటించుకున్నాడన్నారు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మద్యం మత్తులో దేవీసింగ్‌ గతంలో రెండు సార్లు ఆత్మహత్యాయత్నం చేశాడని సీఐ తెలిపారు.

చెరువులో దూకిన మహిళ

మాక్లూర్‌: భర్తతో గొడవపడిన భార్య చెరువులో దూకిన ఘటన మండలంలోని చిక్లి గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బోదాసు లలిత(40) భర్తతో గొడవపడింది. ఈ క్రమంలో క్షణికావేశంలో లలిత గ్రామ సమీపంలో ఉన్న పెద్ద చెరువుకు వెళ్లి దూకింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చీకటిపడడంతో గాలింపు సాధ్యం కాదని, లలిత చెరువులో దూకిందా? లేక భర్తను భయపెట్టేందుకు ఎక్కడికైనా వెళ్లిందా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని చర్చి కాంప్లెక్స్‌లో ఉన్న సూపర్‌ మార్కెట్‌లో ఐదు రోజుల క్రితం చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్‌ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. విజయ సూపర్‌ మార్కెట్‌ వెనుక వైపు ఉన్న గోడకు రంధ్రం చేసి లోనికి ప్రవేశించిన దుండగులు కొంత మేర నగదు, వస్తువులను ఎత్తుకెళ్లారు. యజమాని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన పోలీసులు లంబాడి దేవసోత్‌ రాజు, లంబాడి బుట్ట రాజును అదుపులోకి తీసుకుని విచారింగా నేరంగా అంగీకరించారు. ఇద్దరు కూడా మెదక్‌ జిల్లా టేక్మాల్‌ గ్రామానికి చెందిన పాత నేరస్తులు. ఇదివరకు పలు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి ఇటీవలే బయటికి వచ్చారు. కామారెడ్డితోపాటు తూప్రాన్‌ లో కూడా ఇదే తరహాలో గోడలకు కన్నం వేసి చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారని సీఐ తెలిపారు. నిందితుల వద్ద నుంచి ఒక బైక్‌, గడ్డపార, రెండు సెల్‌ఫోన్‌ లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని సీఐ అభినందించారు.

కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

నిజామాబాద్‌అర్బన్‌/డిచ్‌పల్లి/సుభాష్‌నగర్‌: పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై వివిధ రంగాలకు చెందిన వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

నిరాశకు గురి చేసింది



కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధుల కేటాయింపు నిరాశకు గురి చేసింది. మధ్య తరగతి ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితి పెంచడాన్ని స్వాగతిస్తున్నాం.దేశ అభివృద్ధికి మెరుగై న ఆర్థిక నిర్ణయలు ఇంకా తీసుకోవాల్సి ఉంది.

– వెనిగళ్ల సురేశ్‌, టీపీటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు

పరిమితి పెంచడం సంతోషకరం



ఈ సారి బడ్జెట్‌లో ఆదాయ పరిమితిని పెంచడం సంతోషకరం. ఉద్యోగులకు ఇది ఎంతో ఉపయోగం. కేంద్ర బడ్జెట్‌ను స్వాగతిస్తున్నాం. అన్ని విభాగాల్లో మంచి వృద్ధి సాధించే దిశగా ఉంది.

– మాడవేటి వినోద్‌కుమార్‌, టీసీటీయూ జిల్లా అధ్యక్షుడు

తెలంగాణకు అన్యాయం



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధుల కేటాయింపులో అన్యాయం చేసింది. కాంగ్రెస్‌, బీజేపీ ఎంపీలు రాష్ట్రాని కి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారు.నిధుల కేటాయింపులో జరిగిన అన్యాయంపై బీజేపీ ఎంపీలు సమాధానం చెప్పాలి.

– దాదన్నగారి మధుసూదన్‌రావు, బీఆర్‌ఎస్‌ లీగల్‌ సెల్‌ కన్వీనర్‌

మరిన్ని నిధులు కేటాయించాల్సింది



కేంద్రం తెలంగాణకు మరిన్ని నిధులు కేటాయించాల్సింది. తెలంగాణ ఇప్పటికే వెనుకబడి ఉంది. పరిశ్రమల ఏర్పాటు, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి కోసం ప్రత్యేక రాయితీలు కల్పించాల్సిన అవసరం ఉంది. శాస్త్ర, సాంకేతిక, ఎలక్ట్రానిక్‌ రంగాలు మరింత అభివృద్ధి చెందేలా అధిక నిధులు కేటాయించాలి.

– ఎన్‌ సందీప్‌, వ్యాపారి, నిజామాబాద్‌

వేతనజీవులకు ఊరట



కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్న ఉద్యోగులకు పన్ను మినహాయింపు హర్షించదగిన విషయం. అలాగే స్లాబ్‌ రేట్‌లో మార్పు కొంత ఉపశమనం కలిగిస్తుంది. కానీ పాత పన్ను విధానంలో ఎటువంటి మినహాయింపులు ఇవ్వకపోవడం, స్లాబ్‌రేట్‌ మార్చకపోవడం నిరాశ గురిచేసింది.

– మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఆకర్షించేలా కొత్త పన్ను విధానం



కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను విధానం ఊరటనిచ్చింది. విద్యారంగానికి మరిన్ని నిధులు కేటాయించాల్సింది. అయినా కూడా మంచి బడ్జెట్‌ ప్రవేశ పెట్టారు. వివిధ రంగల్లో కొత్త పన్ను విధానలు బాగున్నాయి.

– అంకం నరేశ్‌, పీఆర్‌టీయూ అసోసియేట్‌ ప్రెసిడెంట్‌

ప్రజల ఆదాయం పెంచే బడ్జెట్‌



మధ్యతరగతి ప్రజల ఆదాయాన్ని పెంచే ఉద్దేశంతో కొన్ని రంగాలపైన దృష్టి సారించారు. ప్రజల ఖర్చులను తగ్గించేలా విద్య, వైద్యం, వ్యక్తిగత పన్నుల విషయంలో వెసులుబాటు కల్పించారు. విద్య, వైద్యంపై మధ్యతరగతి వారు ఖర్చులు తగ్గడంతో పొదుపు పెంచుకునే అవకాశం ఏర్పడుతుంది.

– ఎన్‌ స్వప్న, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, తెయూ

ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్‌



అమలుకాని అనేక పథకాలను చూపించి ప్రజలను మభ్యపెట్టారు. ప్రధానమైన వ్యవసా య రంగానికి పెద్దపీట వేసి రైతుల ఆదాయాన్ని పెంచాల్సి ఉన్నప్పటికీ దేశంలో 45శాతం జనాభాకు ఉపాధి కల్పిస్తున్న వ్యవసాయ, అనుబంధ రంగానికి రూ.1,71,437 కోట్లు గ్రామీణాభివృద్ధికి రూ.2, 66,817 కోట్లు కేటాయించడం విడ్డూరంగా ఉంది.

– ఏ పున్నయ్య, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, తెయూ

అన్నివర్గాల అభ్యున్నతికి బడ్జెట్‌



పేదలు, రైతులు, యువత, మహిళల అభ్యున్నతి కోసం బడ్జెట్‌ రూపొందించారు. దేశ చరిత్రలో తొలిసారి రూ.50లక్షల కోట్లకు మించి ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌ స్వావలంబన భారత్‌ కోసమే రూపకల్పన చేశారు. రైతులు, వ్యవసాయరంగానికి పెద్దపీట వేశారు. రూ.12 లక్షల వార్షిక ఆదాయంపై పన్ను రద్దు చేశారు. మధ్యతరగతి, సామాన్యులకు ఎంతో ఉపశమనం లభిస్తుంది.

– దినేశ్‌ కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

స్టార్టప్‌ కంపెనీలకు చేయూత



మాట్లాడుతున్న స్టార్టప్‌ కంపెనీల ప్రతినిధులు.. మలావత్‌ పూర్ణ

- థీమ్‌ డెవలప్‌మెంట్‌ డైలాగ్‌లో కాకతీయ సాండ్‌ బాక్స్‌ ప్రతినిధులు
- బర్దిపూర్‌ శివారులో క్యాంపస్‌ను ప్రారంభిస్తామని ప్రకటన

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): అమెరికాలో నివసిస్తున్న ప్రవాస భారతీయుడు రాజురెడ్డి (సియెర్రా అట్లాంటిక్‌), ఫణీంద్ర సామ (రెడ్‌ బస్‌ ఫౌండర్‌) స్థాపించిన కాకతీయ సాండ్‌ బాక్స్‌ ఆధ్వర్యంలో భారత్‌లో నూతనంగా ప్రారంభించే స్టార్టప్‌ కంపెనీల కు చేయూతనందిస్తామని సంస్థ ప్రతినిధులు అన్నారు. కాకతీయ సాండ్‌బాక్స్‌, దేశ్‌పాండే ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో 'అన్‌లాకింగ్‌ స్కిల్‌ ఇన్‌ భారత్‌' అనే థీమ్‌తో డెవలప్‌మెంట్‌ డైలాగ్‌ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ్‌పాండే ఫౌండేషన్‌ కీ ఫౌండర్‌ గురురాజ్‌ దేశ్‌పాండే, బిట్స్‌ పిలానీ గ్రూప్‌ వైస్‌ ఛాన్సలర్‌ ప్రొఫెసర్‌ వి.రామగోపాల్‌ రావు, టాస్క్‌ సీఈవో శ్రీకాంత్‌ సిన్హా తో పాటు దేశంలోని నలుమూలల నుంచి 600 మందికి పైగా ఎన్‌జీవోలు, స్టార్టప్‌ కంపెనీల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

కార్యక్రమంలో అతిపిన్న వయస్సులో మౌంట్‌ ఎవరెస్ట్‌ను అధిరోహించిన మలావత్‌ పూర్ణ పాల్గొని పర్వతారోహణలో తన అనుభవాలను వివరించారు. బర్దిపూర్‌ శివారులో నూతనంగా నిర్మిస్తున్న కాకతీయ సాండ్‌బాక్స్‌ కొత్త సామాజిక క్యాంపస్‌ (కే హబ్‌)ను ఆరు నెలల్లో ప్రారంభిస్తామని సంస్థ ప్రతినిధులు ప్రకటించారు.

రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ రైల్వేస్టేషన్‌ పరిధిలోని డిచ్‌పల్లి – ఇందల్వాయి రైల్వేస్టేషన్‌ల మధ్యల రైలుకు ఎదురెళ్లి గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్లు రైల్వే ఎస్సై సాయి రెడ్డి శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 65 నుంచి 70 ఏళ్లు ఉంటుందని, ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతుడిని వివరాలు తెలిసిన వారు 87126 58591 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

గోదావరిలో దూకి ఒకరు..

నవీపేట: మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌ కాలనీకి చెందిన రావుల దమ్మయ్య(35) అనే వ్యక్తి గోదావరినదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వినయ్‌ శనివారం తెలిపారు. దమ్మయ్యకు ఇద్దరు భార్యలు రావుల పోసాని, రావుల సవిత ఉన్నారని, రెండో భార్యతోపాటు ఆమె చెల్లెలు రామవ్వ తరచూ దమ్మయ్యతో గొడవపడేవారన్నారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన దమ్మయ్య శుక్రవారం రాత్రి యంచ శివారులోని గోదావరిలోదూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.

తాటిపల్లిలో చోరీ..

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన అంకం సత్తయ్య ఇంట్లో దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడినట్లు ఏఎస్సై బాల్‌సింగ్‌ శనివారం తెలిపారు. మరదలికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో సత్తయ్య శుక్రవారం తన ఇంటికి తాళం వేసి ఆమె వద్దకు వెళ్లాడు. శనివారం ఇంటికి తిరిగివచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. బీరువాలోని 14 తులాలకు పైగా బంగారం కనిపించడం లేదని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.